సాక్షి
కాకినాడ
బుధవారం । 23 । ఏప్రిల్ । 2025



పుస్తకం.. మహోన్నతం

సమాజానికి వెలుగునిచ్చేది అక్షరం. అది పుస్తకాల రూపంలో ప్రజల చెంతనే ఉంటుంది. అలాంటి పుస్తకాలు రూపొందించడానికి ఎందరో మహానుభావులు అక్షర సేద్యం చేస్తున్నారు.


8లో



చేబ్రోలులో వ్యాధుల విజృంభణ

గొల్లప్రోలు మండలం చేబ్రోలులో రోగాలు ప్రబలి పలువురు అస్వస్థతకు గురయ్యారు.

డెల్టాలకు 4,900 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 4,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 900, మధ్య డెల్టాకు వెయ్యి, పశ్చిమ డెల్టాకు 3 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.40 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

పదిలమేనా..!

- నేడే టెన్త్ ఫలితాల విడుదల
- గత ఏడాది కంటే మెరుగైన ర్యాంకుపై ఆశలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలు బుధవారం విడుదల కానున్నాయి. విద్యార్థి దశలో ఎదుర్కొనే తొలి పబ్లిక్ పరీక్షల ఫలితాలు కావడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ ఏడాది టెన్త్ పరీక్షలు మార్చి 17 నుంచి 31వ తేదీ వరకూ జిల్లా వ్యాప్తంగా 142 కేంద్రాల్లో నిర్వహించారు. ఈ పరీక్షలకు 28,963 మంది దరఖాస్తు చేసుకోగా, వీరిలో 1,405 మంది హాజరు కాలేదు. ఈ నెల 1 నుంచి 8వ తేదీ వరకూ కాకినాడ సాలిపేట బాలికల ఉన్నత పాఠశాలలో జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి చేశారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన 1.90 లక్షల పత్రాలను ఇక్కడ మూల్యాంకనం చేశారు. పదో తరగతి ఫలితాల్లో జిల్లా మెరుగైన ర్యాంకు సాధిస్తుందనే నమ్మకం ఉందని జిల్లా విద్యా శాఖాధికారి పి.రమేష్ తెలిపారు. పరీక్షలకు ముందు విద్యార్థులకు వంద రోజుల ప్రణాళిక అమలు చేశామని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామని చెప్పారు.

మూడేళ్ల టెన్త్ ఫలితాలు ఇలా..

సంవత్సరం	హాజరైన విద్యార్థులు	ఉత్తీర్ణులు	ఉత్తీర్ణత శాతం
2021–22	66,178	46,569	65.83
2022–23	27,358	18,608	68.02
2023–24	27,671	22,993	83.09

రాష్ట్ర మహిళా విభాగంలో ఇద్దరికి చోటు



జమ్మలమడక నాగమణి



రాగిరెడ్డి చంద్రకళాదీప్తి

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన ఇద్దరికి రాష్ట్ర మహిళా విభాగంలో చోటు లభించింది. కాకినాడ రూరల్ నియోజకవర్గానికి చెందిన జమ్మలమడక నాగమణిని రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా, సిటీ నియోజకవర్గానికి చెందిన కాకినాడ నగరాభివృద్ధి సంస్థ (కౌడా) మాజీ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తిని ప్రధాన కార్యదర్శిగా నియమించారు. కష్టపడి పని చేసే వారికి పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని ఈ సందర్భంగా సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. జిల్లాకు చెందిన ఇద్దరు మహిళలకు రాష్ట్ర స్థాయిలో పదవులు ఇచ్చిన అధినేత జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పదవులు పొందిన చంద్రకళాదీప్తి, నాగమణికి ఆయన అభినందనలు తెలిపారు.

విద్యార్థిని చెంపపై కొట్టిన టీచర్

అమలాపురం టౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సమీపంలోని ఐ మైండ్స్ స్కూల్లో నాలుగో తరగతి చదువుతున్న గని శ్రీమాణిక్యాన్ అనే విద్యార్థిని చెంపపై ఆ స్కూలు టీచర్ కొట్టిన విషయం మంగళవారం వివాదంగా మారింది. తమ అమ్మాయి స్కూల్లో కంప్యూటర్ పరీక్ష సరిగ్గా రాయకపోవడంతో చెంపపై టీచర్ బలంగా కొట్టిందని నల్లా వీధికి చెందిన విద్యార్థిని తండ్రి యెరుబండి సురేష్ వాపోయారు. స్కూల్‌కు వెళ్లి అడిగితే టీసీ ఇచ్చేస్తామని బెదిరిస్తున్నారే తప్ప.. ఎందుకు అంతలా కొట్టాల్సి వచ్చిందో చెప్పడం లేదన్నారు. ఈ మేరకు పట్టణ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం ఫిర్యాదు చేశాడు. పట్టణ సీఐ పి.వీరబాబు మాట్లాడుతూ విద్యార్థిని తండ్రి ఫిర్యాదు మేరకు స్కూలు యాజమాన్యం, టీచర్‌ను బుధవారం ఉదయం పిలిచి విచారణ చేస్తామన్నారు.



పిఠాపురం మండలం విరవాడలో ధాన్యం పట్టుబడులు



జల్లూరులో నడి రోడ్డుపై ధాన్యం ఆరబెట్టుకుంటున్న రైతు

కొనుగోల్‌మాల్!

- పేరుకే ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- అధిక శాతం కొంటున్నది దళారులే..
- వారికి మేలు చేసేలా సర్కారు చర్యలు
- రూ.కోట్లలో దోపిడీ

పిఠాపురం: 'కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం.. మద్దతు ధరకే కొంటాం.. చివరి గింజ వరకూ కొనుగోలు చేయాల్సిందే'నంటూ కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటనలు చేసింది. కానీ, క్షేత్ర స్థాయిలో పరిస్థితి ఆవిధంగా లేదని జిల్లాలోని రైతులు ఆవేదన చెందుతున్నారు. రబీ కోతలు ప్రారంభం కాకముందే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, అవసరమైన గోనె సంచులను ప్రభుత్వం సిద్ధం చేయాలి. కానీ, కోతలు ప్రారంభమైన 25 రోజులకు కానీ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, గోనె సంచుల సరఫరా చేయలేదు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మకాలు అంతంత మాత్రంగానే జరుగుతున్నాయి. ఫలితంగా ఆరుగాలం రెక్కలు ముక్కలు చేసుకుని, పెట్టుబడి పెట్టి పండించిన ధాన్యం గింజలు తమ వద్దనే ఉండిపోతూండటంతో అన్నదాతలు కలవరపడుతున్నారు. గత్యంతరం లేక దళారులకు వారు చెప్పిన రేటుకే అమ్ముకోవాల్సిన దుస్థితిని ఎదుర్కొంటున్నారు. ఈ ధాన్యం కొనుగోల్‌మాల్‌ వెనుక పెద్ద కుట్ర జరుగుతున్నట్లు సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

తెర వెనుక ఒప్పందం?

జిల్లావ్యాప్తంగా రబీలో సుమారు 5.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందన్నది అంచనా. ప్రభుత్వం ఏటా కనీసం 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు అనుమతులు ఇవ్వడం సర్వసాధారణం. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ సుమారు 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగింది. ఇదే సమయంలో దళారుల ద్వారా సుమారు 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు జరిగాయని అంచనా. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి తెర వెనుక వేరే వ్యవహారం జరిగిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దళారుల నుంచి అధికార పార్టీ నేతలు భారీగా ముడుపులు అందుకున్నారని, దీనికి ప్రతిఫలంగా రబీ ధాన్యం కొనుగోళ్లలో వారికి భారీగా లబ్ధి చేకూరేలా ఒక మంత్రి ఆదేశాలతో అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అధికార పార్టీ నేతలతో కుదిరిన ఒప్పందం ప్రకారం కొంత మంది దళారులు 75 కేజీల బస్తాకు రైతుకు చెల్లించాల్సిన ధరలో రూ.500 పైగా కోత పెడుతున్నారు. తద్వారా నేతలకు ఇచ్చిన ముడుపులకు రెట్టింపు దోచుకోవాలనేది దళారుల ఎత్తుగడగా చెప్పుకొంటున్నారు.

దోపిడీ రూ కోట్లలో...?

ఇప్పటి వరకూ జిల్లాలో 70 శాతం వరి కోతలు పూర్తయ్యాయి. సుమారు 2.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు జరిగినట్లు అంచనా. 75 కేజీల బస్తా రూ.1,700కు కొనాల్సి ఉండగా దళారులు రూ.1,200కు మాత్రమే కొంటున్నారు. దీనికితోడు రవాణా చార్జి రూ.90, బోనస్ రూ.50 ఇవ్వడం లేదు. ఇలా ప్రతి బస్తాకు రైతుల నుంచి సుమారు రూ.550 వరకూ దోచుకుంటున్నారు. జిల్లాలో దళారులు కొనుగోలు చేసిన ధాన్యం సుమారు 2.60 లక్షల బస్తాల (75 కేజీలు) ద్వారా సుమారు రూ.100 కోట్లకు పైగా తమకు దక్కాల్సిన సొమ్ము దోచుకున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటి వరకూ కొనుగోళ్లు పూర్తయిన ధాన్యంలో సింహభాగం దళారులదే కాగా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో నామ మాత్రంగానే ధాన్యం కొనుగోలు చేస్తున్నారు.

రైతుకు ని'బంధనాలు'

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనాలంటే తేమ శాతం 17 లోపు ఉండాలనే నిబంధన ఉంది. దీంతో, రైతులు తమ ధాన్యాన్ని తేమ శాతం తగ్గేంత వరకూ ఆరబెట్టుకోవాల్సి వస్తోంది. అయితే, దీనికి అవసరమైన కళ్లాలు చాలాచోట్ల లేవు. గత్యంతరం లేక పలువురు రైతులు నడి రోడ్లపై ధాన్యం ఆరబెట్టుకుంటున్నారు. ఈ క్రమంలో వర్షం కురిస్తే ఉన్న ధాన్యం తడిసిపోయి, తేమ శాతం మరింత పెరుగుతున్న పరిస్థితి. అదే మిల్లర్ల వద్ద అయితే డ్రయర్లు ఉంటాయి. వారు క్షణాల్లో ధాన్యాన్ని ఆరబెట్టేస్తారు. దీంతో, దళారులు రైతుల వద్ద పచ్చి ధాన్యం సైతం కొనేస్తున్నారు. బయట ఆరబెట్టుకునే అవకాశం లేకపోవడం.. వాతావరణం రోజుకోలా ఉంటూండటంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో దళారులకు ధాన్యం అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వ నిబంధనలు సడలించాలని కోరుతున్నారు.

కానరాని సీఎంఆర్ కొనుగోలు

మరోవైపు కస్టమ్ మిల్లింగ్‌కు డీడీలు తీసుకుని సిద్ధంగా ఉన్నామని రైస్ మిల్లర్లు చెబుతున్నారు. ఈ విధానంలో రైతుల నుంచి పంట నమోదు పోర్టల్ ద్వారా మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసి, మిల్లింగ్ అనంతరం ఆ బియ్యాన్ని ప్రభుత్వానికి అందజేస్తారు. వెంటనే దానికి సంబంధించిన సొమ్ము రైతు ఖాతాలో, మిల్లింగ్ సొమ్ము మిల్లర్లకు పడుతుంది. ఈ విధానం ప్రస్తుతం ఎక్కడా కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు.

ఈఓ వేధించారు

- చినబాబు పెత్తనం నిజం
- ఏడీసీ విచారణలో అన్నవరం దేవస్థానం ఉద్యోగులు

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో ఇటీవల నెలకొన్న వివాదాలపై దేవదాయ శాఖ అదనపు కమిషనర్ కె.చంద్రకుమార్ మంగళవారం విచారణ నిర్వహించారు. రత్నగిరిపై ప్రకాష్ సదన్‌లోని ట్రస్ట్‌బోర్డు హాలులో దేవస్థానం ఉద్యోగులతో ఉదయం 10.30 గంటలకు సమావేశమయ్యారు. అనంతరం ఒక్కొక్కరితో విడివిడిగా మాట్లాడారు. అన్నవరం దేవస్థానంలో వివాదాలపై 'సాక్షి' ప్రచురించిన కథనాల క్లిప్పింగులు చూపించి, ఉద్యోగుల నుంచి వివరాలు రాబట్టారు. ఈ సందర్భంగా ఈఓ వీర్ల సుబ్బారావు తమను తీవ్రంగా వేధించారని, 30 ఏళ్ల సర్వీసులో ఏ అధికారీ తమను ఈ స్థాయిలో వేధించలేదని పలువురు ఉద్యోగులు చంద్రకుమార్ ఎదుట చెప్పారు. వారి సమాధానాలను దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయం ఎ–సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రికార్డు చేశారు. ఏడీసీ చంద్రకుమార్ బుధవారం ఉదయం ఈఓతో కూడా మాట్లాడి ఉద్యోగుల విమర్శలపై ఆయన సమాధానాన్ని రికార్డు చేయనున్నారు.



దేవస్థానం అధికారులతో సమావేశమైన ఏడీసీ చంద్రకుమార్

ఉద్యోగులేమన్నారంటే..

- పారిశుద్ధ్యం విషయంలో సరిగా వ్యవహరించలేదని అంటూ తన కళ్లు పోవాలని ఈఓ అన్నారని ఓ అధికారి ఏడీసీ వద్ద కన్నీటి పర్యంతమయ్యారు. దీంతో ఉద్యోగం మీద విరక్తి కలిగి వీఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నానని చెప్పారు.
- తాను హార్ట్ పేషెంట్‌నని, చాలాసార్లు ఈఓ వేధించడంతో పాటు వైద్య పరీక్షలకు వెళ్లేందుకు సెలవు అడిగితే 'సెలవు ఇవ్వను. వీఆర్‌ఎస్ పెట్టుకోండి' అని చెప్పారని ఒక ఏఈఓ తెలిపారు. తనకు ఇంక్రిమెంట్ కట్ చేస్తానని చాలాసార్లు బెదిరించేవారని వాపోయారు.
- తన మాతృసంస్థ అయిన అన్నవరం దేవస్థానంలోనే ఉద్యోగ విరమణ చేయాలనే ఉద్దేశంతో బదిలీ చేయించుకున్నానని, అయితే ఈఓ వేధింపులు భరించలేక వీఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నానని చెప్పారు.
- వీక్లీ ఆఫ్ ఇచ్చేవారు కాదని, కనీసం దగ్గర బంధువుల వివాహాలకు కూడా సెలవు ఇచ్చేవారు కాదని, ఒక పూట సెలవు ఇవ్వాలని కోరినా కుదరదనే వారని ఒక సూపరింటెండెంట్ ఏడీసీ ముందు వాపోయారు.
- దేవస్థానం కార్లను ఈఓ, ఆయన కుమారుడు, భార్య సొంత వాహనాల్లా ఉపయోగించేవారని అధికారులు తెలిపారు.

కమిషనర్‌కు త్వరలో నివేదిక : విచారణలో తేలిన అంశాలపై దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్‌కు ఒకటి రెండు రోజుల్లో నివేదిక సమర్పించనున్నట్లు చంద్రకుమార్ తెలిపారు. ఆయనను ఆ శాఖ జిల్లా డిప్యూటీ కమిషనర్ డీఎల్‌వీ రమేష్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు.

సాక్షి కథనాలపై..

- నీటి ఎద్దడి సాకుతో దేవస్థానం సత్రాల్లో ఏసీ గదులు అద్దెకు ఇవ్వకుండా నిలిపివేసిన వైనంపై మార్చి 26న రత్నగిరిపై వింత పాలన, దేవస్థానానికి ఆదాయం తగ్గిన వైనంపై ఈ నెల 8న ప్రచురించిన లక్ష్మీ.. రావేం మా కొండకు?, ప్రభుత్వ సర్వేల్లో దేవస్థానంపై అసంతృప్తి పెరిగిన వైనంపై ఈ నెల 10న ఏమీ బాగోలేదు స్వామీ.. శీర్షికలతో సాక్షి ప్రచురించిన కథనాలపై చంద్రకుమార్ అధికారులను వివరాలు అడిగి రికార్డు చేశారు.
- ఈ నెల 16న సాక్షి ప్రచురించిన చిన్నబాబు వచ్చారు.. బహుపరాక్ కథనంలో ఈఓ సుబ్బారావు కుమారుడు దేవస్థానంలో సీసీ టీవీ ఫుటేజీలు పరిశీలించడం, డ్రోన్ కెమెరా కొనుగోళ్లకు సంబంధించిన అధికారుల సమావేశంలో పాల్గొనడం, ఈఓ అధికారిక వాహనాలను ఉపయోగించడం అవి వాస్తవమేనా అని ఏడీసీ ప్రశ్నించగా, అవన్నీ నిజమేనని వారు చెప్పారు.
- వేధింపులు భరించలేక ఇద్దరు అధికారులు వీఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేయడం, మరికొంత మంది సెలవులో వెళ్లడం తదితర విషయాలపై ఈ నెల 18న సాక్షి ప్రచురించిన నీ కొలువుకు సెలవు స్వామీ.. కథనంపై సిబ్బందిని చంద్రకుమార్ ఆరా తీశారు. ఈఓ వేధింపులు భరించలేక తమకు ఉద్యోగం మీద విరక్తి కలిగిందని వారు బదులిచ్చారు.

అరాచకం.. పతాక స్థాయికి..



బాధితుడు గంగరాజును పరామర్శిస్తున్న మాజీ మంత్రి దాడిశెట్టి రాజా

- గతంలో దళిత మహిళపై లైంగిక దాడికి టీడీపీ నాయకుడి యత్నం
- ప్రతిఘటించిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- సాక్ష్యంగా నిలిచిన కుటుంబంపై టీడీపీ గూండాల దాడులు
- పోలీసుల ప్రేక్షకపాత్ర
- బాధితులకు మాజీ మంత్రి రాజా పరామర్శ

తుని: కూటమి నేతల అరాచకం తునిలో పతాక స్థాయికి చేరింది. తోటి దళిత మహిళకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నించినందుకు ఆ కుటుంబంపై ఓ టీడీపీ నాయకుడు, తన అనుచరులతో కలిసి దాడికి పాల్పడి, తీవ్రంగా గాయపరిచాడు. బాధితుల తరఫున నిలవాల్సిన పోలీసులు.. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి.. నిందితులను అరెస్టు చేయకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తూండటంతో.. ఓ దళిత కుటుంబం ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని ఎప్పుడేం జరుగుతుందోనని క్షణక్షణం భయాందోళనకు గురవుతోంది. బాధితుల కథనం ప్రకారం.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటన వివరాలివీ..

తుని పట్టణం 4వ వార్డు కొండవారిపేటకు చెందిన ఓ దళిత మహిళపై ఫిబ్రవరి 19న టీడీపీ నాయకుడు లావేటి సతీష్ లైంగిక దాడికి ప్రయత్నించాడు. దీనిని గమనించిన స్థానిక ఆరుగుల వారి వీధికి చెందిన వైఎస్సార్ సీపీ గృహ సారథి ఆరుగుల గంగరాజు, ఆయన భార్య వాణీకుమారి తదితరులు అతడిని అడ్డుకున్నారు. దీంతో, సతీష్ అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ సంఘటనపై అదే రోజు రాత్రి బాధితులు తుని పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. కానీ, పోలీసులు కేసు నమోదు చేయలేదు. ఈ నేపథ్యంలో స్థానికులతో కలిసి బాధిత మహిళతో పాటు ఆరుగుల గంగరాజు కుటుంబ సభ్యులు ఫిబ్రవరి 20న కాకినాడ వెళ్లి, జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌కు ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఫిబ్రవరి 25న పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, ఆరోపణలు ఎదుర్కొంటున్న సతీష్, అనుచరులను అరెస్ట్ చేయలేదు. ఈ నేపథ్యంలో సాక్ష్యాలు బలంగా ఉన్నందున ఎక్కడ ఇరుక్కుంటామోననే భయంతో.. గంగరాజు కుటుంబాన్ని సతీష్, అనుచరులు పలుసార్లు హెచ్చరించారు. దళిత మహిళకు అండగా నిలిచారన్న కోపంతో 20 మంది అనుచరులతో కలిసి సతీష్ ఈ నెల 6న గంగరాజు కుటుంబంపై దాడి చేశారు. కేసు వాపసు తీసుకోకపోతే చంపేస్తామంటూ బెదిరించారు. అయినప్పటికీ మాట వినడం లేదన్న అక్కసుతో ఈ నెల 20వ తేదీ రాత్రి సతీష్ మరోసారి తన అనుచరులతో కలిసి గంగరాజు ఇంటికి వెళ్లాడు. ఇనుప రాడ్లు, కర్రలు, రాళ్లతో విచక్షణా రహితంగా దాడి చేసి, వారిని గాయపరిచారు. ఈ దాడిలో గంగరాజు చేయి విరిగిపోయింది. తలపై బలమైన గాయమైంది. అతడిని తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, చికిత్స చేయించారు. తమకు లావేటి సతీష్, కె.డేవిడ్‌రాజు, ఆరుగుల నవీన్, ఆరుగుల దుర్గాప్రసాద్, కాపారపు మనోజ్, కాపారపు రాజు, కుందేటి జాన్, ఎగ్గాడ బాల ఏసు, గంపల గంగబాబు, మామిడి వినాయక్, గుండుబిల్లి నాగేశ్వరరావు, కందవల్లి అన్నపూర్ణ, కేసరపు నాగమణి తదితరుల నుంచి ప్రాణహాని ఉందని గంగరాజు కుటుంబ సభ్యులు ఆరోపించారు.

నిందితులను అరెస్టు చేయాలి

రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ, అంబేడ్కర్ రాజ్యాంగం కల్పించిన హక్కులను టీడీపీ నేతలు కాలరాస్తూంటే చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా మండిపడ్డారు. టీడీపీ నాయకుడు సతీష్, అతడి అనుచరుల దాడిలో గాయపడిన గంగరాజు, వాణీకుమారిలను మంగళవారం ఆయన పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో మాట్లాడుతూ, దళిత మహిళపై టీడీపీ నాయకుడు లావేటి సతీష్ లైంగిక దాడి యత్నానికి పాల్పడిన ఘటనలో సాక్షులుగా ఉన్న గంగరాజు, వాణీకుమారిపై రెండుసార్లు దాడికి ఒడిగట్టారని అన్నారు. ఈ దాడిపై తుని పట్టణ పోలీసులు కేసు నమోదు చేయలేదని, జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌ను ఆశ్రయించడంతో ఎట్టకేలకు కేసు నమోదు చేశారని, అయితే, నిందితులను అరెస్ట్ చేయలేదని చెప్పారు. జిల్లా ఎస్పీ ఆదేశాలను తుని పోలీసులు పట్టించుకోనందువల్లనే రెండుసార్లు దాడికి ఒడిగట్టారని అన్నారు. అధికార పార్టీకి చెందిన తమపై సాక్ష్యం చెప్తే చంపేస్తామంటూ లావేటి సతీష్ హెచ్చరించడంతో పాటు అనుచరులతో గంగరాజు ఇంటికి వెళ్లి దాడికి పాల్పడ్డారని తెలిపారు. తమకు జరిగిన అన్యాయంపై బాధితులు సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టినా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని దుయ్యబట్టారు. అధికార పార్టీకి చెందిన వారు కావడంతో జైల్లో ఉండాల్సిన నిందితులు బయట తిరుగుతున్నారని, వెంటనే వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అణగారిన వర్గానికి చెందిన బాధితులపై జరిగిన దాడి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని, కఠినమైన సెక్షన్లు పెట్టాలని అన్నారు. బాధితులకు వైఎస్సార్ సీపీ అండగా నిలుస్తుందని, అధికారం శాశ్వతం కాదనే విషయాన్ని గమనించాలని హితవు పలికారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌కు రాజా విజ్ఞప్తి చేశారు. ఇదే విధంగా దాడులు జరిగితే ప్రతిస్పందన తీవ్ర స్థాయిలో ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అన్నవరం శ్రీను, రేలంగి రమణాగౌడ్, లగుడు శ్రీనివాస్, వేముల రాజబాబు, నక్కా జాన్ ఆనంద్, మీలా బుజ్జి, కౌన్సిలర్లు కర్రి సత్య జగదీష్, చింతల సునీత, మాజీ కౌన్సిలర్ చితకల రత్నకుమారి, కోరుమిల్లి లలిత, మద్రా దాసు, కాసే కపిల్, చింతల పండు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణము చేతము రారండీ..

- సత్యదేవుని కల్యాణోత్సవాలకు సన్నాహాలు
- నేడు దేవస్థానం, ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశం
- పలు అంశాలపై చర్చ

అన్నవరం: సత్యదేవుని వార్షిక దివ్య కల్యాణ మహోత్సవాల దిశగా అధికారులు ఎట్టకేలకు అడుగులు వేస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై దేవస్థానం, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో రత్నగిరిపై బుధవారం సమన్వయ సమావేశం నిర్వహిస్తున్నారు. కల్యాణోత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులతో పాటు మంత్రులు, ప్రజాప్రతినిధులు కూడా హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎటువంటి ఏర్పాట్లు చేయాలనే అంశాలపై ఈ సందర్భంగా సమీక్షించనున్నారు. పెద్దాపురం ఆర్‌డీఓ రమణి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశంలో పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొంటారు. ఉత్సవాలకు దేవస్థానం తరఫున చేపట్టే ఏర్పాట్లను ఈఓ ఈ సమావేశంలో వివరించనున్నారు.

వీటిపై దృష్టి పెడితే మేలు

- వచ్చే నెల 7 నుంచి 13వ తేదీ వరకూ కల్యాణోత్సవాలు జరగనున్నాయి. 8వ తేదీ రాత్రి 9.30 గంటలకు సత్యదేవుని దివ్యకల్యాణం నిర్వహిస్తారు. దీనికి 10 వేల మందికి పైగా భక్తులు హాజరయ్యే అవకాశముంది. అయితే, స్వామివారి వార్షిక కల్యాణ వేదిక ముందున్న విశ్రాంతి షెడ్డులో సుమారు 2 వేల మంది మాత్రమే తిలకించే అవకాశం ఉంది. ఆ షెడ్డుకు ఇరువైపులా ఉన్న ఆవరణలో స్వామివారి కల్యాణాన్ని తిలకించేలా పెద్ద స్క్రీన్లు ఏర్పాటు చేస్తే మిగిలిన భక్తులకు సౌకర్యంగా ఉంటుంది.
- భక్తులకు మంచినీరు, కల్యాణానంతరం అన్నదాన పథకంలో ఉచిత ఫలహారం రెండుమూడు చోట్ల పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఫలహారం ప్యాకెట్లు రూపంలో పంపిణీ చేస్తే భక్తులు వాటిని తీసుకుని వెళ్లిపోయే అవకాశం ఉంటుంది.
- కల్యాణానంతరం ఉచిత ప్రసాదం, తలంబ్రాలు ఒకేచోట మాత్రమే పంపిణీ చేస్తూండటంతో ఏటా భక్తుల తోపులాట జరుగుతోంది. అలా కాకుండా స్వామివారి సర్క్యులర్ మండపంతో పాటు మరో రెండుచోట్ల పంపిణీ చేయడం మేలు.
- భక్తులు భారీగా వచ్చే అవకాశమున్నందున వారిని నియంత్రించేందుకు సుమారు 500 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేయాలి.
- సత్యదేవుని దివ్యకల్యాణం జరిగే మే 8న ట్రాఫిక్ క్రమబద్ధీకరించాలి. చిన్న, ద్విచక్ర వాహనాలు మినహా మిగిలిన వాటిని సాధ్యమైనంత వరకూ కొండ దిగువనే నిలిపివేయాలి. భక్తులను కొండ మీదకు తరలించేందుకు సుమారు 20 బస్సులు వినియోగించాల్సిన అవసరం ఉంటుంది.
- పశ్చిమ, తూర్పు రాజగోపురాల పరిసరాల్లోని పార్కింగ్ స్థలాల వద్ద భక్తుల సౌకర్యార్థం ఎక్కువ సంఖ్యలో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి. సుమారు వంద మంది అదనపు సిబ్బందితో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి.
- కల్యాణోత్సవాలు జరిగే ఏడు రోజులూ దేవస్థానానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలి.
- ముందు జాగ్రత్తగా అగ్నిమాపక శకటంతో సిబ్బంది కల్యాణం రోజున రత్నగిరిపై ఉండాలి.
- ఉత్సవాల చివరి రోజైన మే 13న సత్యదేవుని శ్రీపుష్పయాగం స్వామివారి నిత్య కల్యాణ మండపంలో నిర్వహిస్తారు. ఆ కార్యక్రమం అనంతరం మహిళలకు రవికెల వస్త్రాలు పంపిణీ చేస్తున్న సమయంలో ఏటా గందరగోళం ఏర్పడుతోంది. దీని నివారణకు పక్కా చర్యలు చేపట్టాలి.
- ఇతర పెద్ద దేవస్థానాల్లో జరిగే ఉత్సవాల మాదిరిగానే సత్యదేవుని కల్యాణోత్సవాలకు కూడా చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌ను నియమిస్తే మేలు.

రథోత్సవానికి విస్తృత ఏర్పాట్లు

కల్యాణోత్సవాల సందర్భంగా మే 7 నుంచి 11వ తేదీ వరకూ సత్యదేవుని వివిధ వాహనాల్లో కొండ దిగువన ఊరేగిస్తారు. ఈ వాహనాల్లో రూ.1.08 కోట్లతో రూపొందించిన భారీ టేకు రథం చాలా పెద్దది. 11వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఈ రథంపై స్వామి, అమ్మవార్లను ఊరేగిస్తారు. దీనిని తిలకించడానికి భారీ సంఖ్యలో భక్తులు తరలి వస్తారు. రథాన్ని లాగేందుకు పోటీ పడే అవకాశం ఉంటుంది. ఆ రోజు విస్తృత బందోబస్తు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ప్రమాదాలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలి. రథం లాగేందుకు అనుభవం కలిగిన నిపుణులను నియమించాలి. గత ఏడాది రథోత్సవం నాడు అన్నవరంలో చాలాచోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అలా కాకుండా ఆ రోడ్డు వరకూ మాత్రమే విద్యుత్ సరఫరా నిలిపివేసేలా, సాధ్యమైనంత త్వరగా రథోత్సవం జరిగేలా చర్యలు తీసుకోవాలి.



కల్యాణోత్సవం సందర్భంగా పశ్చిమ రాజగోపురానికి రంగులు అద్దుతున్న దృశ్యం

మద్యం దుకాణాలు బంద్ చేయాలి

గతంలో అన్నవరం మెయిన్ రోడ్డులో పాత బస్టాండ్ సమీపాన ఒకే ఒక్క మద్యం దుకాణం ఉండేది. ఈ ఏడాది బస్ కాంప్లెక్స్ వెళ్లే దారిలో మరో మద్యం దుకాణం కూడా ఏర్పాటు చేశారు. ఈ దుకాణాల ముందు నుంచే రథోత్సవం జరుగుతుంది. అందువలన కల్యాణోత్సవాలు జరిగే ఏడు రోజులూ అన్నవరంలో పంపా సత్రం వద్ద ఉన్న మద్యం దుకాణాలను 48 గంటల ముందు నుంచే బంద్ చేయించేందుకు చర్యలు తీసుకోవాలి.

'జల'గండం తప్పినట్టే..

పంపా జలాశయం గత నెలలో డెడ్ స్టోరేజీకి చేరినప్పటికీ ఈ నెలలో కురిసిన వర్షాలతో నీటిమట్టం 82.5 అడుగులకు చేరింది. దీంతో, కల్యాణోత్సవాల వరకూ నీటి సమస్య దాదాపు పరిష్కారమైనట్టే. అయితే, ఈ ఉత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు వస్తారు. దీంతోపాటు మే 12న స్వామివారి చక్రస్నానం పంపా జలాశయంలో నిర్వహించాలి. ఉత్సవాలకు ఇంకా రెండు వారాల సమయం ఉంది. ఈలోగా ఎండలు తీవ్రమైతే ఉన్న నీరు కొంత ఆవిరయ్యే అవకాశం ఉంటుంది. అందువలన గతంలో కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించిన విధంగా ఏలేరు నుంచి పంపాకు నీటిని తరలించడం మేలు.

క్లుప్తంగా

వేసవి సెలవుల షెడ్యూల్ విడుదల

- నేడు పాఠశాలలకు చివరి పని దినం

రాయవరం: పాఠశాలలకు వేసవి సెలవుల షెడ్యూల్‌ను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.వి జయరామరాజు మంగళవారం విడుదల చేశారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు గురువారం నుంచి (ఈ నెల 24) నుంచి జూన్ 11 వరకూ వేసవి సెలవులను ప్రకటించారు. బుధవారం పాఠశాలలకు చివరి పని దినం. 2025–26 విద్యా సంవత్సరం జూన్ 12 నుంచి ప్రారంభమవుతుంది. అయితే అన్ని రకాల మేనేజ్‌మెంట్లలో పనిచేసే ఉపాధ్యాయులు వారి క్యాడర్‌తో సంబంధం లేకుండా జూన్ 5వ తేదీ నాటికి పాఠశాలల్లో రిపోర్టు చేయాలి. పాఠశాల సంసిద్ధతా కార్యక్రమాలు, నూతన విద్యా సంవత్సరానికి సంబంధించి సన్నాహక పనులను పూర్తి చేయడానికి ముందుగానే పాఠశాలలకు హాజరు కావాలి. అయితే భారత వాతావరణ శాఖ, ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖల సలహాల ఆధారంగా షెడ్యూల్‌లో మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉంటుంది. ఏవైనా అత్యవసర పరిస్థితులు, వాతావరణ సంబంధిత సమస్యలు తలెత్తిన సందర్భంలో విద్యాశాఖ నుంచి కొత్త సూచనలు జారీ అయ్యే అవకాశం ఉంటుంది.

టిప్పర్ దగ్ధం



తూర్పులక్ష్మీపురంలో కాలిపోతున్న టిప్పర్

ఏలేశ్వరం: మండలంలోని తూర్పులక్ష్మీపురంలో మంగళవారం టిప్పర్ (లారీ) దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే.. గ్రామంలో రోడ్డు నిర్మాణ పనుల కోసం టిప్పర్‌తో గ్రావెల్ తీసుకువచ్చారు. రోడ్డు పక్కనే దాన్ని అన్‌లోడ్ చేస్తుండగా పైన ఉన్న విద్యుత్ తీగలకు టిప్పర్ తొట్టె భాగం తగిలింది. దీంతో ఒక్కసారిగా మంటలు ఎగసి పడ్డాయి. డ్రైవర్ వెంటనే కిందకు దిగిపోవడంతో ప్రమాదం నుంచి బయట పడ్డాడు. ఈ ఘటనలో టిప్పర్ వెనుకభాగం పూర్తిగా కాలిపోయింది.

ఐపీఎస్ అధికారిగా సమాజ సేవ చేస్తా

- తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే విజయం
- యూపీఎస్సీ 94 ర్యాంకర్ స్నేహిత్

పిఠాపురం: ఐపీఎస్ అధికారిగా సమాజ సేవ చేస్తానని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 94 ర్యాంకర్ చెక్క స్నేహిత్ తెలిపారు. పిఠాపురానికి చెందిన ఈ యువకుడి ఘనతను ప్రముఖులు ప్రశంసిస్తున్నారు. ఈ సందర్భంగా స్నేహిత్ మాట్లాడుతూ చిన్ననాటి నుంచి తనకు ఐపీఎస్ అవ్వాలనే కోరిక ఉండేదని, అదే లక్ష్యంగా చదువుకున్నానన్నారు. తన విజయం వెనుక తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉందన్నారు. తల్లి మాధురి కుమునిది గుంటూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్నారని, తండ్రి వెంకట్ చిన్న వ్యాపారవేత్త అని తెలిపారు. కాగా..స్నేహిత్ ఐదో



స్నేహిత్

తరగతి వరకు పిఠాపురంలోని ఆదర్శ విద్యాలయలో చదువుకున్నాడు. ఆరో తరగతి నుండి ఇంటర్ వరకూ గుంటూరులోని భాష్యం విద్యాసంస్థల్లో చదివాడు. ఎంసెట్‌లో 31వ ర్యాంకు సాధించి, గుజరాత్‌లో ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా ఉత్తీర్ణుడయ్యాడు. సివిల్స్‌లో ఆప్షనల్ సబ్జెక్టుగా మ్యాథ్స్ తీసుకున్నాడు. ఢిల్లీలో కోచింగ్ తీసుకోవడంతో పాటు సొంతంగా చదివి సివిల్స్‌లో 94 ర్యాంకు సాధించాడు.



తల్లిదండ్రులు, సోదరుడితో స్నేహిత్

చిన్ననాటి నుంచే చదువులో మేటి



తల్లిదండ్రులతో వినయ్

కొవ్వూరు: నిడదవోలు విద్యుత్ డివిజన్ పరిధిలో కొవ్వూరు టౌన్ ఏఈ(డీ–1)గా పనిచేస్తున్న దొమ్మేటి జగదీశ్వరరావు కుమారుడు దొమ్మేటి వినయ్ 2024 యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) సివిల్ సర్వీస్‌లో 274వ ర్యాంకు సాధించాడు. జగదీశ్వరరావు రెండో కుమారుడు అయిన వినయ్ చిన్ననాటి నుంచే చదువులో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాడు. పదో తరగతిలో పదికి 9.8 శాతం మార్కులు, ఇంటర్మీడియెట్‌లో 1000కి 986 మార్కులు సాధించాడు. పశ్చిమ బెంగాల్‌లోని దుర్గాపూర్‌లో నిట్‌లో బీటెక్ (ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్) పూర్తి చేసి, పదికి 8.8 శాతం మార్కులు దక్కించుకున్నాడు. యూపీఎస్సీలో మూడోసారి ప్రయత్నించి 274వ ర్యాంకు సొంతం చేసుకున్నాడు. ఇదంతా తన తల్లిదండ్రుల సహకారం, ప్రోత్సాహంతో సాధించానని వినయ్ చెబుతున్నాడు. జగదీశ్వరరావు మొదటి కుమారుడు సాయి సంతోష్ ఎంఎస్ పూర్తి చేసి ప్రస్తుతం జర్మనీలో ఉద్యోగం చేస్తున్నాడు. వినయ్ తల్లి దుర్గ గృహిణి.

పుస్తకం.. మహోన్నతం

- అక్షరమే అసలైన సంపద
- సమాజానికి వెలుగునిచ్చే దీపం
- పుస్తక రచనలో ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక స్థానం
- నేడు ప్రపంచ పుస్తక దినోత్సవం

కపిలేశ్వరపురం: సమాజానికి వెలుగునిచ్చేది అక్షరం. అది పుస్తకాల రూపంలో ప్రజల చెంతనే ఉంటుంది. అలాంటి పుస్తకాలు రూపొందించడానికి ఎందరో మహానుభావులు అక్షర సేద్యం చేస్తున్నారు. సమాజంలో విజ్ఞాన జ్యోతులు వెలిగించడానికి కృషి చేస్తున్నారు. పుస్తక రచనలో దారులెన్ని ఉన్నా సామాజిక ప్రయోజనమే అంతిమ లక్ష్యం. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అనేక పుస్తక ప్రచురణా సంస్థలు, రచయితలు, కవులు సామాజిక ఉద్యమకారులు అలనాటి కందుకూరి వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు. మారుతున్న మానవ సమాజ పోకడలకు తమ రచనల ద్వారా అద్దంపడుతున్నారు. సమాజ హితం కోరుతూ సాగుతున్న పుస్తక ప్రచురణ, రచన తదితర అంశాలపై నేడు ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

పుస్తక దినోత్సవ నేపథ్యం

ప్రపంచంలో సామాజిక సమస్యలు పెరిగిపోతున్న నేపథ్యంలో యునెస్కో స్పందించి పుస్తక పఠన ఆవశ్యకతను గుర్తించాలని ప్రపంచ దేశాలకు సూచించింది. కనుమరుగవుతున్న పుస్తక సంపదను కాపాడుకోవడానికి, భవిష్యత్తు తరాలకు జ్ఞానాన్ని పంచేందుకు యునెస్కో ఏప్రిల్ 23 ను ప్రపంచ పుస్తక దినోత్సవంగా ప్రకటించింది. ఆ రోజున సదస్సులు, సమావేశాలు, పరిశోధనాపరమైన అంశాలపై చర్చలు చేపట్టాలని సూచించింది.



రామచంద్రపురంలో రావు కృష్ణారావు రచన 'అస్తిత్వం, చైతన్యం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఐవీ తదితరులు (ఫైల్)

ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక స్థానం

రాజమహేంద్రవరం కేంద్రంగా సాహితీ సేవలు విస్తారంగా సాగేవి. సమాజంలో దుర్మార్గాలు పెరిగిపోయినప్పుడల్లా పుస్తకమే ప్రజలను మేల్కొలిపేది. ప్రముఖ సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం 'నీతి కథామంజరి' పేరుతో 158 కథలను సంకలనం చేస్తూ రాసిన పుస్తకం స్త్రీల సమస్యలను వెలుగులోకి తెచ్చింది. ఆనాటి నుంచి నేటికీ జిల్లాలో సాహిత్య కృషి కొనసాగుతోంది. రాజమహేంద్రవరంతో పాటు కాకినాడ, పిఠాపురం, పెద్దాపురం, రామచంద్రపురం కొత్తపేట, అమలాపురం, యానాం ప్రాంతాల్లో పలు సాహితీ సంస్థలు, స్మారక సంస్థల ద్వారా పుస్తక ప్రచురణ, రచన, పఠన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

పరిశోధనలకు చేదోడు

చారిత్రక, సామాజిక అంశాలపై పరిశోధనలు చేసే వారికి జిల్లాలోని రూపుదిద్దుకున్న పుస్తకాలు దోహదపడతాయి. రాజమహేంద్రవరంలోని గౌతమి గ్రంథాలయం ఎంతో చారిత్రాత్మకమైంది. హైదరాబాద్ తెలుగు విశ్వ విద్యాలయానికి అనుబంధంగా నడుస్తున్న బొమ్మూరులోని తెలుగు సాహిత్యపీఠంలో సుమారు 50 వేల అరుదైన పుస్తకాలు ఉన్న గ్రంథాలయం ఉంది. కపిలేశ్వరపురం జమీందారీ దివాణం గ్రంథాలయంలోని పుస్తకాలను అధ్యయనం చేసిన పలువురు పీహెచ్‌డీ పట్టాలను పొందారు.

సాంకేతికత తోడుగా..

పెరిగిన సాంకేతికతను పుస్తక పఠనం పెంచడానికి వినియోగించుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలోని అనేక మంది సామాజిక మాధ్యమాల్లో సాహిత్య గ్రూపులను ఏర్పాటు చేసి పుస్తకాల్లోని అంశాలపై చర్చలు జరుపుతున్నారు. కపిలేశ్వరపురం మండలం అంగరకు చెందిన పెద్దింశెట్టి రామకృష్ణారావు 250 మందితో పుస్తకం పేరుతో గ్రూపు ఏర్పాటు చేసి పుస్తకాలపై చర్చిస్తున్నారు. విజయవాడ, విశాఖపట్టణం కేంద్రంగా నడుస్తున్న మంచి పుస్తకం వాట్సాప్ గ్రూపుల్లో మన జిల్లాకు చెందిన అనేక మంది భాగస్వాములయ్యారు.

సంతోషంగా ఉంది



చదువుకునే రోజుల్లో సామాజిక ఉద్యమాలకు ఆకర్షితుడినై విద్యార్థి, యువజన సంఘాల్లో పని చేశాను. గత కాలపు ఉద్యమాలను గ్రంథస్తం చేయాలన్నా కోరిక ఇటీవల తీరింది. 'నవ సమాజం కోసం' పేరుతో నేను రాసిన పుస్తకం ఈ ఏడాది మార్చి 9న కాకినాడలో ఆవిష్కృతమై ఆదరణ పొందింది.

– దువ్వా శేషబాబ్జీ, కాకినాడ

పుస్తక రచన

పుస్తకాన్ని రాయడమంటే పెద్ద చదువులు చదవాలనో, గ్రంథాలయాల్లో గంటల తరబడి గడపాలనో అనుకొంటే పొరబాటే. తన చుట్టూ జరుగుతున్న సంఘటనలకు అక్షర రూపం ఇస్తే చాలు. అలాంటి వారిలో రాజమహేంద్రవరానికి చెందిన దేవగుప్తపు పేరలింగం ఒకరు. ఆయన 13 పుస్తకాలను రచించగా వాటిలో కొన్నింటిని స్వతంత్రంగా ప్రచురించారు. తన సైకిల్‌కు 'హేతువాద చైతన్య రథం' అనే పేరుపెట్టి మూడు దశాబ్దాలకు పైగా సైన్స్, సామాజిక భావాలను ప్రచారం చేశారు. 82 ఏళ్ల వయసులో 2014 ఏప్రిల్ 14న తుదిశ్వాస విడిచే వరకూ తన ఇంటినే సైన్స్ గ్రంథాలయంగా నడిపారు.

భార్య జ్ఞాపకార్థం

కాకినాడ జిల్లా జగన్నాథగిరికి చెందిన ప్రజా నాట్యమండలి నాటక కళాకారుడు పోలిశెట్టి రామకృష్ణ తన భార్య జ్ఞాపకార్థం ఏడాదికో పుస్తకాన్ని వెలుగులోకి తీసుకొస్తున్నారు. పోలిశెట్టి అమ్మాజీ స్మారక సమితి పేరుతో సొంత ఖర్చులతో గత కాలపు ప్రఖ్యాత పుస్తకాలను ఆధునిక సాంకేతికతతో అచ్చు వేయించి ఉచితంగా అందజేస్తున్నారు.

పలు రచనలు

కాకినాడకు చెందిన రావు కృష్ణారావు మానవ సమాజ పరిణామ క్రమాన్ని నిర్దేశించే చలన సూత్రాలను విశ్లేషిస్తూ అనేక రచనలు చేశారు. రామచంద్రపురంలోని డాక్టర్ చెలికాని రామారావు స్మారక సమితి నిర్వాహకుడు డాక్టర్ చెలికాని స్టాలిన్ ప్రోత్సాహంతో ఈయన రచనలు అనేకం వెలుగులోకి వచ్చాయి. ఆధునిక బేతాళ కథలు, బతుకు పోరు కథా సంకలనం పుస్తకాలు తెలుగు పాఠకులను ఆలోచింపజేశాయి.

మహనీయుల కృషికి అక్షర రూపం

కవితా రావు ఇంగ్లిష్ రచన లేడీ డాక్టర్స్ పుస్తకాన్ని కాకినాడకు చెందిన డాక్టర్ పీఎస్ ప్రకాశరావు అదే పేరుతో తెలుగులోకి అనువదించారు. ఆనందిబాయి, కాదంబినీ గంగూలీ, రుక్మాబాయి రౌత్, హైమవతి సేన్, ముత్తు లక్ష్మిరెడ్డి, మేరీ పూనాన్ లూకోస్.. వైద్య వృత్తిని చేపట్టే క్రమంలో ఎదుర్కొన్న సామాజిక, సాహసోపేతమైన ఘటనలెన్నో ఆలోచింపజేస్తాయి. ఈ నెలలో 'పరిచయాలు–సమీక్షలు' పేరుతో మరో పుస్తకాన్ని తీసుకొచ్చారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

పెరవలి: పెళ్లి విషయంలో భార్య, కుమార్తె తన మాట వినడం లేదనే మనస్తాపంతో ఓ వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. ముక్కామల గ్రామానికి చెందిన కమాడి ధర్మారావు (40)కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు పెళ్లి చేయాలని నిర్ణయించుకుని ఇటీవల ఓ సంబంధం తీసుకువచ్చాడు. అయితే భార్య, కుమార్తెలకు ఆ సంబంధం నచ్చలేదు. దీంతో నెల రోజులుగా వారికి నచ్చచెబుతూ వస్తున్నాడు. అయినా వారు ఒప్పుకోకపోవడంతో మనస్తాపం చెందిన ఈ నెల 20వ తేదీ పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే ఆతడిని తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. భార్య కమాడి సావిత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కమాడి ధర్మారావు

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

దేవరపల్లి: ఉపాధి పనులు చేస్తున్న కూలీలపై తేనెటీగలు దాడి చేశాయి. దేవరపల్లి మండలం బందపురంలో మంగళవారం ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన 45 మంది కూలీలు బందపురం–గొల్లగూడెం రోడ్డులో నీటి బోదెలు తవ్వుతున్నారు. ఆ సమీపంలోని చెట్టుపై ఉన్న తేనెటీగలు మూకుమ్మడిగా వారిపై దాడి చేశారు. దీంతో కూలీలు భయంతో పరుగులు తీశారు. తేనెటీగల దాడిలో సుంకర గంగరాజు తీవ్రంగా గాయపడ్డాడు. అతడికి దేవరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు చికిత్స చేశారు. గంగరాజు కోలుకున్నాడని, ఎటువంటి ప్రమాదం లేదని ఏపీవో ఆర్‌వీ శ్రీనివాసరావు తెలిపారు.



దేవరపల్లి పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న గంగరాజు

కాకినాడ బార్ అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం

కాకినాడ లీగల్: కాకినాడ బార్ అసోసియేషన్ 2025–26 సంవత్సరం ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. అనంతరం అర్ధరాత్రి వరకూ కౌంటింగ్ జరిగింది. ఈ ఎన్నికల్లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏలూరి సుబ్రహ్మణం విజయం సాధించారు. జనరల్ సెక్రటరీగా చెక్కపల్లి వీరభద్రరావు (చంటి), ఉపాధ్యక్షుడిగా పెన్మెత్స రామచంద్రరాజు, జాయింట్ సెక్రటరీగా బండి నరేంద్ర, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా జోకా వీఎస్ విజయకుమార్, లైబ్రరీ సెక్రటరీగా మేడపాటి రామారెడ్డి, కోశాధికారిగా కోకా వెంకట కృష్ణారావు, లేడీస్ రిప్రజెంటీవ్‌గా జి.దివ్య శ్రీవిద్య, సీనియర్ కమిటీ మెంబర్‌గా నక్కా సంజీవ్ కుమార్, జూనియర్ కమిటీ సభ్యులుగా మర్ల ప్రవల్లిక, గుత్తుల మంగరాజు, షేక్ ప్రేమ్ నజీర్, దుళ్ల నాగబాబు విజయం సాధించారు. మొత్తం 1,160 ఓట్లకు గాను 1,013 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. సూపర్ సీనియర్ కమిటీ మెంబర్‌గా వేగుళ్ల వెంకట రమణమూర్తి, మహిళా కమిటీ మెంబర్‌గా కె.శ్రీవాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



ఏలూరి సుబ్రహ్మణ్యం అధ్యక్షుడు



చెక్కపల్లి వీర భద్రరావు(చంటి), జనరల్ సెక్రటరీ



పెన్మెత్స రామచంద్రరాజు, ఉపాధ్యక్షుడు

అలరించిన శ్రీ ప్రకాష్ గస్టో కార్యక్రమం

బాలాజీచెరువు (కాకినాడ): స్థానిక దంటు కళాక్షేత్రంలో మంగళవారం సాయంత్రం శ్రీ ప్రకాష్ సినర్జీ స్కూల్ గస్టో (థియేటరీ ఆర్ట్స్) కార్యక్రమం నిర్వహించారు. కాకినాడ, పెద్దాపురం స్కూళ్ల బ్రాంచ్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రెండు రోజుల పాటు ఆరు రంగస్థల నాటికలను మూడు భాషలలో ప్రదర్శించనున్నారు. గస్టో ద్వారా భాష, నాటకం, కవిత్వం, సాహిత్యం తదితర వాటిపై అవగాహన కల్పించడానికి ఏర్పాటు చేశామని పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ ప్రకాష్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జేఎన్‌టీయూకే వీసీ సీఎస్ఆర్‌కే ప్రసాద్, థియేటర్ ప్రాక్టీషనర్ అమలా రాయ్, ఐసీసీఆర్ డైరెక్టర్ సంజయ్ హాజరయ్యారు. విద్యతో పాటు పలు కళల ప్రాధాన్యత తెలుపుతూ, వాటిని విద్యలో భాగం చేయడం సంతోషమని పాఠశాల యాజమాన్యాన్ని ప్రశంసించారు.

డీఈఈ సెట్ నోటిఫికేషన్ విడుదల

- నేటి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- మే 8వ తేదీ తుది గడువు
- జూన్ 2, 3 తేదీల్లో పరీక్ష

రాయవరం: ఉపాధ్యాయ శిక్షణ కోర్సుల్లో ప్రవేశించేందుకు ఉద్దేశించిన డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ డీఈఈ సెట్ – 2025) నోటిఫికేషన్ విడుదలైంది. 2025–26 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం బొమ్మూరులో ఉన్న డైట్ కళాశాలతో పాటుగా, కొన్ని ప్రైవేట్ కళాశాలల్లో కూడా అడ్మిషన్లు పొందవచ్చు. జూన్ 2, 3 తేదీల్లో ఆన్‌లైన్‌లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు.

పరీక్ష ఫీజు రూ.750

డీఈఈ సెట్–2025కు దరఖాస్తు చేసుకునేవారు రూ.750 పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంది. ఈ నెల 22 నుంచి మే 7వ తేదీ వరకు ఆసక్తి, అర్హత ఉన్న వారు ఆన్‌లైన్‌లో పరీక్ష ఫీజును చెల్లించవచ్చు. సీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ లేదా ఏపీడీఈఈసెట్.ఏపీఈఎఫ్ఎస్.ఇన్ ద్వారా బుధవారం (ఈ నెల 23) నుంచి దరఖాస్తు చేసుకోవచ్చు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో పరీక్షా కేంద్రాలను కేటాయిస్తారు.

అర్హతలివీ

దరఖాస్తుదారులకు ఈ ఏడాది సెప్టెంబర్ ఒకటో తేదీ నాటికి 17 ఏళ్లు నిండి, భారత జాతీయుడై ఉండాలి. పదో తరగతితో పాటు, ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన ఉత్తీర్ణత సాధించాలి. ఇంటర్‌లో 50 శాతం మార్కులు రావాలి, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు 45 శాతం సాధిస్తే సరిపోతుంది. ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణతకు ఓసీ, బీసీ అభ్యర్థులు 35 శాతం, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు 25 శాతం మార్కులు సాధించాలి. ఇంటర్మీడియెట్ ఒకేషనల్ కోర్సులు చదివిన వారు ప్రవేశ పరీక్ష రాసేందుకు అనర్హులు.

మార్కుల కేటాయింపు

గణితం, ఫిజికల్స్ సైన్స్, బయలాజికల్ సైన్స్, సోషల్ స్టడీస్‌కు ఒక్కో బ్రాంచ్‌కు 25 శాతం వంతున సీట్లు కేటాయిస్తారు. 6–10 తరగతుల వరకు ఉన్న సిలబస్‌పై ప్రశ్నపత్రం ఉంటుంది. 100 మార్కులకు ఆబ్జెక్టివ్ తరహాలో 2.30 గంటల పాటు ఆన్‌లైన్ పరీక్ష రాయాలి. పార్ట్–ఎ 60 మార్కులు, పార్ట్–బి 40 మార్కులకు ప్రశ్న పత్రం ఉంటుంది. పార్ట్–ఎలో టీచింగ్ ఆప్టిట్యూడ్, జనరల్ నాలెడ్జ్, ఇంగ్లిషు, తెలుగులో ఐదేసి మార్కుల వంతున, ఎంచుకున్న భాష, గణితం, జనరల్ సైన్స్, సోషల్ స్టడీస్‌కు సంబంధించి ఒక్కో సబ్జెక్టుకు 10 మార్కుల వంతున మొత్తం 60 ప్రశ్నలు వస్తాయి. పార్ట్–బిలో అభ్యర్థి ఎంచుకున్న ప్రధాన సబ్జెక్టు నుంచి 40 ప్రశ్నలు 40 మార్కులకు వస్తాయి.

ముఖ్యమైన తేదీలు

ఫీజు చెల్లింపు:	మే 5 వరకు
దరఖాస్తుల ఆన్‌లైన్ సబ్మిషన్:	నేటి నుంచి మే 8 వరకు
హాల్ టిక్కెట్ల డౌన్‌లోడ్:	మే 20
పరీక్ష తేదీలు:	జూన్ 2, 3
ఫలితాల ప్రకటన:	జూన్ 10
హెల్ప్‌లైన్ నంబరు:	79958 69743

ఏలేరు కాలువలో యువకుడి గల్లంతు

రౌతులపూడి: రౌతులపూడి శివారు ఏలేరు ఎడమ కాలువలో పడి గుమ్మరేగుల గ్రామానికి చెందిన వెంటూరి జయబాబు అనే 29 ఏళ్ల యువకుడు మంగళవారం సాయంత్రం గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రౌతులపూడి పోలీసులు కేసు నమోదు చేశారు. కాలువలో గాలించినా జయబాబు ఆచూకీ లభించలేదని ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు.



జయబాబు (ఫైల్)

తాళ్లపూడిలో మృత శిశువు కలకలం

తాళ్లపూడి: మండల కేంద్రమైన తాళ్లపూడిలోని పుష్కరాల రేవులో మంగళవారం మృత శిశువు ఘటన కలకలం రేపింది. సుమారు 8 నెలలున్న గర్భస్థ మృత శిశువును చిన్న వస్త్రంలో చుట్టి అక్కడ పడవేశారు. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. కొవ్వూరు రూరల్ సీఐ బి.విజయబాబు, ఏఎస్సై చక్రారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ ముద్దై తదితరులు సంఘటనా ప్రదేశానికి చేరుకున్నారు. మృత శిశువును శవ పరీక్ష కోసం కొవ్వూరు ప్రభుత్వం ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అలాగే గ్రామంలోని ఆస్పత్రుల్లో ప్రసవాలకు సంబంధించిన వివరాలు సేకరించి, మృత శిశువు ఆచూకీ గుర్తించారు. గ్రామంలోని అశోక హాస్పిటల్‌కు రెండు రోజుల క్రితం గోపాలపురం మండలం ప్రగడపల్లికి చెందిన రాసపోతుల శ్రీనివాసు, దేవీ స్వప్న అనే దంపతులు వచ్చారు. దేవీ స్వప్నకు నెలలు నిండడంతో డాక్టర్లు ఆమెకు వైద్య పరీక్షలు జరిపారు. అప్పటికే కడుపులో శిశువు మృతి చెందడంతో ఆపరేషన్ చేసి బయటకు తీశారు. ఆ బిడ్డను తామే ఖననం చేసుకుంటామని చెప్పడంతో శ్రీనివాసుకు అప్పగించారు. కానీ మృతశిశువును ఎక్కడ ఖననం చేయాలో తెలియక పుష్కరాలరేవు వద్ద వదిలేసి వెళ్లిపోయాడు.



తాళ్లపూడి పుష్కరాల రేవులో మృత శిశువు

చేబ్రోలులో వ్యాధుల విజృంభణ

- వాంతులు, విరేచనాలతో పలువురికి అస్వస్థత
- ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులు
- గ్రామంలో వైద్య సిబ్బంది సర్వే

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలులో రోగాలు ప్రబలి పలువురు అస్వస్థతకు గురయ్యారు. జ్వరం, వాంతులు, విరేచనాలు, కీళ్ల నొప్పులు, రొంప, జలుబు, దగ్గు వంటి వ్యాధులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చేబ్రోలు ప్రభుత్వ ఆస్పత్రితో పాటు గొల్లప్రోలు, పిఠాపురాల్లోని ప్రైవేటు ఆస్పత్రులలో వీరందరూ చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు వైద్య సిబ్బంది గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి బాధితులకు చికిత్స అందిస్తున్నామని పీహెచ్‌సీ వైద్యుడు జగదీష్ తెలిపారు.

కారణమేమిటో!

ఇటీవల పక్క మండలంలో జరిగిన ఒక శుభకార్యానికి వెళ్లిన కొందరు అస్వస్థతకు గురయ్యారు. అలాగే గ్రామంలో జరిగిన వివిధ శుభకార్యాలలో భోజనాలు చేసిన వారికి వాంతులు, విరేచనాలు అయ్యాయి. దీంతో ఫుడ్ పాయిజన్ కావడమే దీనికి కారణమని భావిస్తున్నారు. స్థానికంగా వేసిన కొత్త బోరులోని నీరు తాగడం వల్ల వ్యాధులు ప్రబలాయని మరికొందరు చెబుతున్నారు. దీంతో ఆ నీటికి పరీక్షలు చేయించిన వైద్యాధికారులు, నీటి వల్ల కాదని చెబుతున్నారు. మాంసాహారం ఎక్కువగా తినడం వల్ల ఇలా జరిగి ఉంటుందనే వార్తలు వస్తున్నాయి. గ్రామంలో సుమారు వంద మంది అనారోగ్యానికి గురైనట్టు గుర్తించామని వైద్య సిబ్బంది చెబుతుండగా, వారి సంఖ్య మరో వంద వరకూ ఉంటుందని గ్రామస్తులు అంటున్నారు. వాతావరణ మార్పులు, ఎండల తీవ్రత వల్ల కూడా ఇలా రోగాలు విజృంభించే అవకాశం ఉందని వైద్యాధికారులు అన్నారు. కాగా.. గ్రామంలో వ్యాధుల విజృంభణపై జెడ్పీటీసీ ఉలవకాయల నాగ లోవరాజు వైద్యులను ఆరా తీశారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు.



చేబ్రోలు పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న బాధితులు



చేబ్రోలులో నెలకొన్న అపరిశుభ్రత